

# పరాజితులు

ఎమ్. ప్రేమలీల

ఎప్పుడూ ఎవరినీ దమ్మిడీ యాచించని వాడు, నిజాయితీ పరుడు, ఇతరుల కష్టాలు సహించలేని జాలి గుండెకలవాడు, స్వార్థం ఎరగనివాడు — ఎంతో పెద్ద అవసరం వచ్చి ఆప్త మిత్రుడని నమ్ముకున్న వాని సహాయం కోరినాడు. అలాంటప్పుడు ఆ ఆప్త మిత్రుని కర్తవ్యం ఏమిటి? లోకం తీరు ఏమిటి?

ఉదయభానుడు కిటికీలోనుంచి తొంగి చూశాడు.

రాఘవరావు కళ్ళు తెరిచాడు. మధురమైన అనుభూతి ఏదో మనసులో మెదిలింది. అతని పెదవులపై చిరునవ్వు వెల్లివిరిసింది.

డోర్ కర్టెన్ రెపరెప లాడుతూంది. రాఘవరావుకు లేచిపోవటానికి మనస్కరించలేదు. ప్రక్కకు తిరిగి కళ్ళు మూసుకొని పండు

కున్నాడు. వలపు తలపుల గిలిగింతల్లో ఉయ్యాల లూగిపోతున్నాడు. లలిత వస్తుందనీ, తన మృదుహస్తాలతో తనను స్పృశించి లేపుతుందనీ అతనికి తెలుసు. ఆ మధుర క్షణాల కోసమే ఎదురు చూస్తున్నాడు.

ద్వారంవద్ద ఎవ్వరో వస్తున్నట్లు చప్పుడయింది.

లలితే వస్తుందని రాఘవరావు భావించాడు. కళ్ళు గట్టిగా మూసుకుని కదలకుండా పండుకున్నాడు. మామూలుగా మృదువుగా ముఖాన్ని స్పర్శించవలసిన చేయి తన భుజంమీద గట్టిగా తట్టింది.

ఈ వింత మార్పుకు రాఘవరావు మనస్సులో కొంచెం బాధపడ్డాడు.

"లలితా, లాలిత్యం చచ్చిపోతుంది. కర్కశత్వం శిలలకే శోభిస్తుంది" అంటూ తిరిగి చూశాడు.

ఎదురుగా రామమూర్తి నిలబడి ఉన్నాడు.

రాఘవరావు ముఖం సిగ్గుతో మొగ్గయింది. నవ్వుతూ లేచి, "ఏం భాయీ, ఏమిటి

# పరాజితులు

సంగతి, ఉదయమే ప్రథమ దర్శనం ప్రసాదించావు" అన్నాడు.

"నీ దురదృష్టం. లేకపోతే లాలిత్యభాగ్యమే కల్గేది" అన్నాడు రామమూర్తి నవ్వుతూ.

రాఘవరావు మరీ బిగ్గరగా నవ్వాడు.

లలిత వచ్చింది. లోపలికి తొంగిచూసి క్రొత్త వ్యక్తిని చూసి వెంటనే తిరిగి వెళ్ళిపోయింది.

రాఘవరావు, రామమూర్తి వంక చూసి విచిత్రంగా నవ్వాడు. రామమూర్తి ఊరికే చిరునవ్వు చిలకరించాడు.

రాఘవరావు లేచి కూర్చున్నాడు. ఎదురుగా ఉన్న కుర్చీలో రామమూర్తి ఆసీనుడయ్యాడు.

"ఇంత ప్రొద్దున్నే వచ్చావు సంగతేమిటి?" అన్నాడు రాఘవరావు రామమూర్తి ముఖంలోకి చూస్తూ.

రామమూర్తి ప్రశాంతంగా నవ్వి, "నిన్ను ఒక సాయం కోరటానికి వచ్చాను. మరి పాల ముంచుతావో నీట ముంచుతావో" అన్నాడు.

"నీరేం ఖర్మ పంచదారవేసిన పాలలోనే ముంచుతానులే. అసలు సంగతేమిటో చెప్పు" అన్నాడు రాఘవరావు.

"చెప్పాలంటే చాలఉంది రాఘవరావూ. ఎప్పటికైనా నీకీ సంగతి చెప్పవలసిందే. ఇంత కాలం దాగిన రహస్యం నాకు నిన్ననే తెలిసింది. ఆవిషయం నీకుచెప్పాలంటే నాకు కొంచెం కష్టంగానే ఉందనుకో......" ఇంకా ఏదో చెప్పబోతున్నాడు.

"ఆ అవసర మేమిటో చెప్పవయ్యా. నీ ఉపోద్ఘాతం వినేందుకు తీరి కెవడికుందిక్కడ" అన్నాడు రాఘవరావు నవ్వుతూ.

"నవ్వులాట గాదు రాఘవరావ్. చాల పెద్ద బాధలో ఉండి వచ్చాను. నీవు సహాయం చేస్తావని ఆశ వుంది. నీవు కాదంటే ఏం జరుగుతుందో నాకే తెలియదు" అన్నాడు రామమూర్తి.

రామమూర్తి ముఖంమీద విషాదఛాయలు ఆవరించాయి.

రాఘవరావు ఆశ్చర్యపోయాడు. ఎప్పుడూ ఉల్లాసంగా ఉండే రామమూర్తి ఇలాగేనా అని సందేహపడ్డాడు. రాఘవరావు తన నాలుగేళ్ల పరిచయంలో రామమూర్తి అంతగా విచారించటం చూడలేదు. ఎప్పుడూ ఏవో కబుర్లు చెబుతూ ఉత్సాహంగా ఉండేవాడు. రామమూర్తి ముఖం ఎల్లవేళలా ఆనందంతో తొణికిసలాడుతూ వుండేది. దుఃఖం అంటే అసలు రామమూర్తికి తెలియదేమో అనిపించేది. అందరితోనూ ఎంతో కలుపుగోలుతనంగా మెదులుతూ ఉండేవాడు. అదే రాఘవరావును ఆకర్షించింది. రాఘవరావు నిజాయితీ, రామమూర్తి హుషారూ జోడయ్యాయి. ఇద్దరూ కలసి మెలసి తిరిగారు. ఒకర్ని మరొకరు పూర్తిగా అర్థం చేసుకొన్నారు. ఇద్దరూ ఆప్తమిత్రులైనారు.

ఇద్దరూ ఒకే కాలేజీలో ఒకే డిపార్టుమెంటులో పని చెయ్యటం వారి స్నేహానికి మరింత దోహదాన్నిచ్చింది. రామమూర్తి బ్రహ్మచారి. రాఘవరావు వివాహితుడు. రామమూర్తికి తనవా రెవ్వరూ లేరని వినికిడి. తల్లిదండ్రి చనిపోయ్యారని రాఘవరావు కొక్కడికే రూఢిగా తెలుసు. ఆస్తిపాస్తులు ఏమీ లేవని కూడా తెలుసు. రాఘవరావు మంచి సంపన్నకుటుంబంలో పుట్టాడు. విద్యార్థిదశలోనే లలితతో వివాహమయింది. రాఘవరావు ధనవంతుడూ, సంస్కారపరుడూ, సహృదయుడూ కావటం వల్ల మంచివాడుగా కీర్తి పొందాడు. రామమూర్తికి తనకు వచ్చే జీతం తప్ప మరో ఆధారం లేదు. అందులోనే రామకృష్ణ మఠానికి కొంత,




మీకు నమ్మకమైన
నీలగిరి తైలం
కావాలంటే
కేమిల్ బ్రాండ్ వాడండి
అది కల్తీలేనిది
S d.Rao


పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పముపేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, నీ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్ట గ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW-13) Jullundur City.

అనాథ శరణాలయానికి కొంత ప్రతి నెలా దానాలు చేస్తాడు. అయినా అతని అవసరాలకు మిగిలింది బాగానే సరిపోతుంది. అందువల్ల ఎవ్వరినీ దమ్మిడీ యాచించే అవసరం అతనికి ఏనాడూ కలగలేదు. రామమూర్తిది వెన్నలాంటి మనస్సు. ఇతరుల కష్టాలను సైతం సహించలేని జాలిగుండె కలవాడు. ఎంత సంతోషాన్ని బయటకు వ్యక్తీభూతం చెయ్యగలడో అంతటి విషాదాన్ని సైతం దాచుకోగలడు. ఇతరుల దృష్టిలో మాత్రం రామమూర్తి నిత్య సంతోషి.

రాఘవరావు తీక్షణంగా రామమూర్తి వంక చూశాడు. రామమూర్తి ముఖం తిప్పివేసుకొన్నాడు.

"సరే. నీ బాధ ఏమిటో చెప్పు చూద్దాం. ఎప్పుడూ లేని విచిత్ర ప్రకృతి అలవాటు చేసుకొంటున్నావే!" అన్నాడు రాఘవరావు.

రామమూర్తి నవ్వి "విచిత్ర ప్రకృతిగాదు; పరిస్థితుల ప్రాబల్యం" అన్నాడు.

రాఘవరావు ఏమీ మాట్లాడలేదు.

రామమూర్తి మళ్ళీ "నీవు సహాయం చేస్తానంటే నేను చెప్తాను" అన్నాడు.

"ఏమిటో చెప్పు" అన్నాడు రాఘవరావు.

"నాకు పది రోజుల్లో రెండు వేల రూపాయలు కావాలి. నెలకో వంద చొప్పున తర్వాత నేను తీర్చుకుంటాను" అన్నాడు రామమూర్తి.

రామమూర్తి రాఘవరావును ఇంతవరకూ కానీ అడిగి పుచ్చుకోలేదు. ఒక్కసారి రామమూర్తికి రెండువేల రూపాయల అవసరం ఏమి కలిగిందో రాఘవరావు ఊహించలేకపోయ్యాడు.

ఆశ్చర్యంతో "రెండు వేలే. ఎందుకు నీకు? ఏమైనా పెళ్ళి సంబంధం వచ్చిందా. ప్రధానం ఏమైనా పెట్టాలా" అన్నాడు రాఘవరావు.

రామమూర్తి "అవును. పెళ్ళినిమిత్తమే కాని నా పెళ్ళి మాత్రం కాదు" అన్నాడు.

"నీ పెళ్ళి కాకపోతే మరెవ్వరిదీ?"

"ఇంతకాలం నుంచి నాకు తెలియని నా చెల్లి పెళ్ళికోసరం. నీవు తప్పకుండా సహాయం చేస్తావని ఆశతో వచ్చాను."

"ఇంతకాలంనుంచి నీకు తెలియని నీ చెల్లి! ఎవరా చెల్లి? ఏమా కథ?"—అన్నాడు రాఘవరావు విచిత్రభంగిమలో.

"పరిహాసం కాదు రాఘవరావ్. నేను చాల సీరియస్‌గా చెబుతున్నాను. నా జీవితంలో నా ఆప్త బంధువులు నన్ను సహాయం కోరటం ఇదే మొదటిసారి. నేను ఆ సహాయం చెయ్యగలిగితే ఎంతగా సంతోషిస్తానో చెప్పలేను. నాకసలు బంధువులు ఉన్నారనే తెలియదు. ఈ నాటికి నాకా విషయం తెలిసింది. నా హృదయం ఎంత ఉప్పొంగిపోతూపోందో నీకు చెప్పలేను. నాకు కూడ ఒక సోదరి ఉంది. చిన్నమ్మ ఉంది. వారు నా సహాయం అర్థించారు. ఎంత ఆశతో ఎంత నమ్మకంతో నాకు ఉత్తరం వ్రాశారో!"

రామమూర్తి మనసులో విషాదంతోబాటు సంతోషం కూడ మిళితమై వుంది. అవి అతని ముఖంలో వింతగా శోభించాయి.

"అరే! విచిత్రంగా ఉందే.....నీకు ఇంత కాలం తెలియకుండా ఎక్కడో ఉన్న చెల్లి ఈనాడు ఒక్కసారి అనుకోకుండా రెండువేల రూపాయలు పంపమని ఉత్తరం వ్రాసిందా! నీకు తెలియకుండా నీకు సోదరి ఉండటం ఏమిటి? ఒకవేళ ఉన్నా పరిచయం ఏమీలేని ఒక అజ్ఞాత అన్నయ్యను రెండువేల రూపాయలు అర్థించటం ఏమిటి? ఇదేదో ఎవ్వరో తమాషా చేస్తున్నట్లున్నారు. నువు గప్‌చిప్‌గా ఉండు. తర్వాత జరిగే దేదో చూద్దాం" అన్నాడు రాఘవరావు.

"అది కాదు. ఆమె కష్టం ఏమిటో నీకు తెలియదు......ఇదిగో ఈ ఉత్తరం చదువు. నీకే అర్థమవుతుంది" అని జేబులోనుండి ఉత్తరం తీసి ఇచ్చాడు.

రాఘవరావు అందుకున్నాడు కాని విప్పటానికి సందేహించాడు.

"ఫరవాలేదు చదువు" అన్నాడు రామమూర్తి.

"సరే" అని రాఘవరావు ఉత్తరం విప్పాడు. ఉత్తరం చక్కని దస్తూరితో వ్రాసిఉంది. అక్షరాలు ముద్దు లొలుకుతున్నాయి. రాఘవరావు ఉత్తరాన్ని బిగ్గరగా చదవ నారంభించాడు.

"ప్రియమైన రామమూర్తికి నీ చిన్నమ్మ ఆశీర్వదించి వ్రాయునది.

నీకు నేను ఎవరినో చెప్పుకోవలసిన దుర్దినం వస్తుందని నేను ఎన్నడూ కలలో కూడ అనుకోలేదు. కాని పరిస్థితుల ప్రాబల్యంవల్ల, నా అసహాయ స్థితివల్ల ఈనాడు నా దౌర్భాగ్య జీవితాన్ని నేను తెలియచేయవలసి వచ్చింది. నీకు నే నెవరనైనదాన్ననీ, నీ చిన్నమ్మననీ నేను చెప్పుకొటానికి నోచుకోలేదనీ, నాకా అదృష్టం లేదనీ నాకు తెలుసు. అదే కారణంతో నీవు నన్ను అసహ్యించుకుంటావని గూడ తెలుసు. కాని ఏం చెయ్యను. నా నిర్భాగ్యపు బ్రతుకు ఇలా అజ్ఞాతంగా గడిచిపోతే నాకు ఎంతో శాంతిగా ఉండేది. కాని విధి అలా వ్రాయలేదు. నాతోబాటు నీ లేత హృదయాన్ని కూడ బాధిస్తున్నందుకు నన్ను మన్నించు నాయనా.

ఎప్పుడు జరిగిన సంగతో......చెప్పుకోటానికి సైతం సిగ్గుగా ఉంది. కాని నీవు నా పుత్రుడితో సమానం. నీ ముందు నేను సిగ్గుపడి ఏం లాభం. నా పాడుజీవితం నీకు తెలియపరచటమే మంచి దనుకుంటాను.

ఎంతోకాలంనుంచి నీకు ఈ సంగతి తెలియచేద్దామనుకునేదాన్ని. కాని నీవు అసలు నిజంగా నమ్ముతావో లేదో అనే శంకతో నా కోర్కెను నేనే చంపుకునేదాన్ని. ఈనాడైనా ఆ అనుమానం లేకపోలేదు. కాని నా దుర్దశ నన్నీ కార్యానికి సైతం ప్రోద్బలం చేసింది. నా కోసమే అయితే నిశ్చింతంగా ప్రాణాల్నయినా

(తరువాయి 41వ పేజీలో)



# పరాజితులు

(19వ పేజీ తరువాయి)

విడిచేదాన్ని గాని ఈ విషయం నీకు తెలియచేసే దాన్ని కాదు.

ఇదంతా ఇందిరకోసం చేస్తున్నాను. ఇందిర నీకు చెల్లి అవుతుంది. ఇందిర అనే చెల్లి నీకు ఉందని నీకు తెలియకపోవచ్చు. తెలిసి చేసినా తెలియక చేసినా నా పాపానికి ఇప్పటికే మోయలేనంత భారాన్ని మోశాను. అనంత ఆవేదన అనుభవించాను. కాని నేను చేసిన పాపంలో మరొకరికి కూడ భాగం ఉంది. చని పోయి ఏ లోకంలో ఉన్నారో మీ నాన్నగారు... ఆయన్ను నిందించాలని నా ఉద్దేశ్యం కాదు కాని ఆయనకు కూడ ఇందులో భాగం ఉందని చెప్పటానికి నా మనస్సుకు ఎంతో బాధగానే ఉంది. కాని విషయం విపులంగా చెప్పందే నీకు నా పరిస్థితి అర్థం కాదుగా!

మీ నాన్నగారు కొంతకాలం బళ్ళార్లో ఉండి కలప వ్యాపారం చేశారు. నీకు తెలుసో తెలియదో ఇది పదహారేళ్ళనాటి మాట. ఆయన ఒంటరిగానే వుంటూవుండేవారు. మీ అమ్మ నువ్వు నరసరావుపేటలో ఉండేవారట. అప్పటికే నేనొక అనాధను. కట్టుకున్న భర్త యుద్ధంలో చచ్చిపోయ్యాడు. తమ్ముడు తిండి పెట్టలేక యింటినుండి తరిమివేశాడు. దిక్కు లేక బజారు పాలయ్యాను. కొంతకాలంపాటు వంటమనిషిగా కుదిరి పొట్టగడుపుకున్నాను. ఎవరో ఒక ఆఫీసరు బళ్ళారి బదిలీ అయితే ఆయన కుటుంబంతో నేనూ వచ్చేశాను. ఆ ఆఫీసరు ఇంట్లో రెండేండ్లపాటు పని చేశాను. కాని నా తలవ్రాత నన్నక్కడా ఉండ నివ్వలేదు. ఆ ఆఫీసరు భార్య, తన భర్తకు నాతో సంబంధం ఉందని అనుమాన పడింది. దాంతో నన్ను వేధించ మొదలుపెట్టింది. భరించలేక నేనే పనిలోనుండి మానుకున్నాను.

తర్వాత మీ నాన్నగారు నన్ను వంటకు కుదుర్చుకున్నారు. వంటచేసి ఆయన ఆదరణ పొందగల్గాను. నన్ను ఆయన ఎంతో దయతో చూస్తూ ఉండేవారు. చివరికి ఆయన హృద యంలో నాకు స్థానం ఉన్నట్లు నేను గ్రహిం చాను. నేను సంతోషంతో అంగీకరించి లొంగి పోయ్యాను.

ఆ పాపానికి ఫలితమే ఈ ఇందిర. కాని మీ నాన్నగారు ఉదారస్వభావులు. నమ్మిన వారిని మోసగించేటంత నీచులుకారు. ఆయన ఇందిరకు అన్యాయం చెయ్యలేదు. ఆయన చెయ్యగలిగితే ఇంకా చేసేవారే. కాని ఆయనకు ఉన్నట్టుండి గుండెజబ్బు పట్టుకుంది. భగ వంతునికి ఆ కాస్త ఆశ్రయం ఉండటం కూడ ఇష్టంలేకపోయిందేమో! అదే సంవత్సరం వ్యాపారం కూడ నష్టంతో నడిచింది. గుండె జబ్బుతో ఆయన మరణించారు. ఆయన చని పోయే ముందు ఇందిర పేర ఆరువేల రూపా యలు బ్యాంకులోవేసి పొయ్యారు. ఆ దయా మయుణ్ణి నా మనస్సులో ఎప్పుడూ పూజిస్తూ ఉంటాను. ఆఖరి గడియల్లో మీ బంధువులు చాలమంది వచ్చారు. అక్కడ దేన్నదంతా అమ్మేసి వెళ్ళిపొయ్యారు. నేను మాత్రం ఆ స్థలం వదలి పోలేక అనంతదుఃఖంతో అక్కడే కొంతకాలం ఉన్నాను.

కాని ఇందిర పుట్టుక తెలియని మరో చోటికి వెళ్ళాలని భావించి ఈ ఊరు వచ్చాను. వంటకత్తెగానే బ్రతుకు గడిపి వేశాను. కాని నేను ఇందిరకు అన్యాయం చెయ్య లేదు. నా రెక్కల కష్టంతో నన్ను పోషించు కుంటూ ఇందిరను కూడ పోషించగలిగాను. ఇందిర చదువుకు మాత్రం మీ నాన్నగారిచ్చిన డబ్బులో కొంత వాడాను. ఇందిర ఇంటరు పాసయింది. వంటలక్క కూతురు ఇంటరు పాస వటం ఆశ్చర్యమయితే కావచ్చు. కాని మీ నాన్న గారి ఔదార్యంవల్ల ఇందిర ఈనాడు ఇంత మనిషి కాగలిగింది.

ఇందిరకు చదువైతే చెప్పించాను. కాని నేను ఆడదాన్ని. ఆమెకు వయస్సు వచ్చింది. మంచి వరుణ్ణి తెచ్చి ఒక ఇంటిదాన్ని చేయ టం కంటె జీవితంలో ఇంకా నేను కోరుకో తగ్గది ఏమీ లేదు. అయినా నా తాహతెంత. ఏమి చూసి ఇందిరను చేసుకొంటారు. నా దౌర్భాగ్యం ఇందిరను సైతం వెంటాడుతూంది. వంటలక్క కూతురని నెనకాడుతున్నారు.

చివరికి ఎలాగో ఒక సంబంధం వెతికాను. కుర్రవాడైతే మంచివాడే. ఏదో మూటనిఖై రూపాయల ఉద్యోగం కూడ చేస్తున్నాడట. కాని కట్నం ఆరువేలయినా లేందే వల్లకాదంటు న్నారు. ఏం చేయను. మీ నాన్నగా రిచ్చినవి నాలుగునే లున్నాయి. నా కష్టంతో సంపాదించినవి రెండువేలున్నాయి. ఇంకా రెండు వేలు కావాలి. ఎవరి నడిగితే ఎవరిస్తారు. ఏమి చూసి ఇస్తారు. నా తలబ్రద్దలు కొట్టుకున్నా నామీద దయ తలచేవారు లేరు. ఇందిరకు ఇదిపోతే మంచి సంబంధం దొరుకుతుందని నాకు నమ్మకంలేదు. ఇందిరకోసం నేను ఇంతకాలం బ్రతుకు వెళ్ళ బుచ్చాను. ఇందిర సుఖంకోసం నానా అగ చాట్లు పడ్డాను. ఆమె ఒక ఇంటిదై సుఖంగా ఉంటే చూసి కళ్ళు మూస్తాను. ఇదే నాఆఖరి కోరిక. కాని నా కోరిక తీరే యోగం ఉన్నట్లు కనబడటంలేదు.

ఇందిర చాల యోగ్యురాలు. ఇందిరకు నేను నిజంగా తల్లిగా తగనిదానిని కావచ్చు. కాని నాయనా......ఇందిర మాత్రం నీకుచెల్లిగా తగనిది మాత్రం కాదు. నేను చేసిన పాపానికి ఇప్పటికే అది ఫలితం అనుభవించింది. దాని జీవితం కష్టాలపాలు అవుతుందేమోనని హృద యం బ్రద్దలయ్యేటట్లు ఏడుస్తున్నాను.



ప్రేమైక జీవనులు

చిత్రం—డి. నవనీతరావు (హైదరాబాదు-4)

ఇంతకాలంనుంచి నీకు మే మెవ్వరమయిందీ తెలియకపోయినా నీవు తప్పకుండా ఇందిర కోసమైనా మామీద దయ తలుస్తావనే ఆశతో నీకీ ఉత్తరం వ్రాస్తున్నాను. ఇది నా దురాశ అయితే కావచ్చు. కాని నీవు నన్ను మన్నించగలవని నా నమ్మకం. నా జీవితంలో నేను అనుభవించింది ఏమీలేదు. ఇందిరైనా సుఖంగా ఉంటే నా కంతే చాలు.

ఈ రెండు వేల రూపాయలు నీవు సహాయం చేస్తే ఇందిర వివాహం అవుతుంది. నీ చేతి మీదుగా ఇందిరను ఒక ఇంటిదాన్ని చేసి నా పాపానికి నిష్కృతి ప్రసాదించు నాయనా.

ఇందిరకు ఇంతవరకు తన జన్మ వృత్తాంతం తెలియదు. ఇంతకాలం గోప్యంగానే దాచాను. ఇందిర లేతహృదయాన్ని నొప్పించటం నా కిష్టం లేదు. ఇందిర మనస్సు చాల మృదువైంది. ఈ నా పాపిష్టి జీవితం సంగతి తెలిస్తే ఇందిర తప్పకుండా ఆత్మహత్య చేసు కుంటుంది. ఆ సంగతి నాకు బాగా తెలును. అందుకే నిన్ను ఒక్కటి వేడుకుంటున్నా బాబూ! ఈ విషయం ఏనాడూ ఏ సంద ర్భంలోనూ ఇందిరకు చెప్పవద్దు.

ఇందిరకు పది రోజులకు మీ బంధు వొకా యన వస్తాడనీ, ఆయనే సన విషయాలు చూస్తాడని ఉత్తరం వ్రాసిపెడుతున్నాను.

ఈ నా లేఖ నీ చేతుల్లో ఉండేవరకు నేను ఈ లోకంలో ఉండకపోవచ్చు. నీవు ఇందిరను ఆదుకుంటావనే నమ్మకంతోనే నే నీ ఘోరానికి తలపెట్టి ఇందిరను తల్లిలేని దాన్నిగాచేసి పోతున్నాను. అన్నగా ఆమె జీవితంలో ప్రవే శించి నేను ఆపాదించిన కాలుష్యాన్ని కడిగివేసి ఇందిర జీవితాన్ని పునీతం చేస్తావనే ఆశతో, నమ్మకంతో ఇందిరను నీ చేతుల్లో పెడు తున్నాను. ఇందిరకు తల్లివైనా, తండ్రివైనా,

అన్నవైనా మరేదైనా ఇక వీవే. వీకు కష్టం కలిగించినందుకు మన్నించమని వేడుకుంటు న్నాను.

ఇట్లు,
వీ నిర్భాగ్యపు చిన్నమ్మ."

చదవటం పూర్తిచేసి రాఘవరావు నిట్టూర్పు

## పరాజితులు

విడిచాడు.

రామమూర్తి కళ్ళలో కన్నీరు కదిలింది. హృదయంలో వేదన మెదిలింది. ఘనీభవించిన అనంత విషాదం అతనిలో నిలిచింది.

రాఘవరావు ఉత్తరం మడిచిపెట్టి రామమూర్తి ముఖంలోకి చూచాడు.

రామమూర్తి ఎంతో ఆశతో రాఘవరావు వంక చూశాడు.


'ఆయనను మెప్పించుట అంత సులభంకాదు...'



బొంబాయి 16, మహీమ్‌లో డి 8. యూనియన్ హౌస్‌యందున్న శ్రీమతి ఆర్.ఆర్. ప్రభు ఇలా చెప్పుచున్నది:
'ఆయనకేదీ మెప్పులేదు. ఇంక బట్టల సందర్భంలోనా...!' 'ఇప్పుడు ఆయన బట్టలన్నిటినీ సన్‌లైట్‌తో ఉతుకు తున్నాను...ఆయనకూ నాకూ పరమానందం! సన్‌లైట్ సమృద్ధిగా నురగనిస్తుంది, ఉతికే పని నాకెంతో సులభం! 'నేను ఉతికేవన్నీ తెల్లగాను, కాంతిగాను ... పరిశుభ్రంగా వుంటాయి!' నాకుసన్‌లైట్ తప్ప మరేదీ నచ్చదు!'

బట్టలను శుభ్రంగా ఉతుకుటకు శుద్ధమైన, సౌమ్యమగు సన్‌లైట్ వంటిదింకేదీ లేదని గృహిణులు తెలుసుకున్నారు. మీరు కూడా గ్రహింతురు.

సన్‌లైట్




మీ బట్టలకు వరప్రసాదం!

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

S.30-X52 TL

"కల్పన చాల రసవత్తరంగానే నడిచింది. ఊ" అన్నాడు రాఘవరావు నవ్వుతూ—

రామమూర్తి ఒక్కసారి కృంగిపోయ్యాడు. రాఘవరావు ఎంతో సానుభూతి చూపిస్తాడనీ, తనను ఓదార్చి ఇందిర వివాహవిషయంలో తనకు సాయం చేస్తాడని రామమూర్తి ఊహించాడు. కాని రాఘవరావు వాలకం చూస్తే పూర్తి విరుద్ధంగా ఉంది.

"కల్పనా! ఎందు కవుతుంది?" అన్నాడు రామమూర్తి.

రాఘవరావు ఉద్రేకంతో "లేకపోతే ఏమిటి? జీవితాలు నిజమయిన ప్రపంచంలో ఉంటాయి గాని, ఇలా నవలాలోకంలో తేలియాడి పోయేట్లు ఉండవు. ఒక చిన్నకథ కల్పించి నంపించింది. నీ వేమో క్రిందినుంచి పైదాక కదిలిపోయావు. ఎవ్వ రామె? ఆమె నీకు నిజంగా చిన్నమ్మ అయితే నిజంగానే మీ నాన్నకు ఆమెమీద అంత ఔదార్యమే ఉంటే నీకీ విషయం తెలియకుండా ఇంతకాలం దాగి ఉండేది గాదు. ఇదేదో నాటకం. నీ మంచి తనాన్ని నీ మానసిక దౌర్బల్యాన్ని ఉపయోగించు కోవాలని చూస్తున్న ఎవరో మాయలాడి పన్నిన పన్నాగం. నీవు నిశ్చింతగా ఉండు. కల్లబొల్లి మాటలకు కదిలిపోవద్దు" అన్నాడు.


రామమూర్తి ముఖం పేలవమయిపోయింది.

జీవం చచ్చిన స్వరంలో "రాఘవరావ్. నీవు కొన్ని విస్తృత దృష్టితో చూడు. మనుషు లంతా మోసగాళ్ళేనని ఎందు కనుకోవాలి. ఆ విషాదమూర్తిని చూస్తే నీకు జాలి వేయ టం లేదూ? ఆమెకు నా తండ్రితో సంబంధం ఉన్నా లేకపోయినా ఆ పరిస్థితిలో ఉండి ఆమె నన్ను సహాయం అర్థిస్తే నేను తప్పకుండా సహాయం చేస్తాను. దానికి నేను ఏమీ నను కాడను" అన్నాడు.

"అంత దయ, ఔదార్యం ఉంటే సహా యం చెయ్యి. నే నొద్దన్నానా" అన్నాడు రాఘవరావు కోపంగా.

"అందుకేగా నీ దగ్గరికొచ్చింది. నాకు రెండువేలు ఇవ్వు. నీకు నేను తర్వాత తీర్చు కుంటాను. నిన్ను నేను ఇంతవరకు ఏదీ అడగలేదు. నన్ను నిరాశపర్చవని ధైర్యంతో అడుగుతున్నాను."

"రామమూర్తీ, క్షమించు. మరో సారయితే నీకు కావలసినంత ఇచ్చిఉండేవాణ్ణి. కాని ఈ సందర్భంలో మాత్రం నీకు ఏమీ ఇవ్వ లేను. నీవు ఏమి అనుకున్నా నాకు ఇష్టమే. తన సంగతి ఎలా పోయినా ఇతరులకోసం తల బ్రద్దలు చేసుకుంటూ జీవితం భగ్నం చేసు కోవటం అంటే నాకు ఇష్టం ఉండదు. మన్నించు. నన్ను బలవంతం చెయ్యకు" అన్నాడు రాఘవరావు.



శ్రీసాయిబాబా ఆలయం (కర్నూలు)

ఫోటో—పెండ్యాల సత్యనారాయణ (తాడేపల్లిగూడెం)

రామమూర్తి ఖిన్నుడయిపోయాడు. రాఘవ రావు ఇలా మాట్లాడతాడని కలలో కూడ అనుకోలేదు.

రాఘవరావుతో వాదించి లాభంలేదని రామ మూర్తికి తెలుసు. విషణ్ణవదనంతో పరా జితుడైన రామమూర్తి మాట్లాడకుండా బయటకి వెళ్ళిపోయ్యాడు.

రాఘవరావు మాట్లాడకుండా చూస్తూ ఊరుకున్నాడు.

రాఘవరావు మనసులో ఏదో పాషాణం ప్రవేశించినట్లయింది. రామమూర్తిమీద జాలి కలిగింది, ఆప్యాయత ఒలికిపోయింది, ప్రేమ పొంగులు వారింది. రామమూర్తి కోర్కెను, మాత్రం తాను నిరాకరించాడు. అందుకే అతని హృదయంలో ఎక్కడో ఏదో మాయని గాయం తగిలినట్లయింది.

రాఘవరావు దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చు న్నాడు.

లలిత రెండు కప్పుల్లో కాఫీతో ప్రవే శించింది. టేబుల్‌మీద పెడుతూ రాఘవరావు వంక చూడకుండా "రామమూర్తిగారు వెళ్ళి పోయినారా" అంది.

రాఘవరావు ఎంతో కష్టంతో "ఊ" అని ఒక నిట్టూర్పు విడిచాడు.

లలిత మధురస్వరంతో "మీరు చాల కఠినమైన నిర్ణయాని కొచ్చారు. రామమూర్తి హృదయం మీరు అర్థం చేసుకున్నట్లు లేదు. పాపం ఎంత బాధతో వెళ్ళాడో, మీరు అంత కర్కశత్వం ఎలా వహించగల్గారు?" అంది.

రాఘవరావు చలించకుండా "లలితా, నన్ను బాధించకు. ఆ విషయంతో నన్ను వేధించకు. రామమూర్తి సంగతి నాకు బాగా తెలుసు. ఇతరులమీద అంత జాలి, దయ ఉండవచ్చు. కాదనను. కాని తన సంగతి కూడ కొంత చూసు కోవాలిగా. ఆమె ఎవరో ఒక అజ్ఞాత సోదరి కోసం రెండువేలు ఇవ్వటానికి సిద్ధపడ్డాడు. ఇప్పటికే వాడు తినే తిండి, ఉండే రూము చూస్తే నాకు హృదయం దహించుకుపోతుంది. రోజులు మాడి వాడు అణాపైసలతోసహా బాకీ తీరుస్తాడు. కాదన్నా వాడు ఊరుకోడు. వాడు ఎందుకు బాధపడాలి? ఏ పాపం చేశాడని? ఎవరో చేసిన పాపానికి అనుభవించవలసిన వాడు వీడా!" అని అంటూ ఉంటే కళ్ళవెంట నీరు బిందువులుగా ప్రవహించాయి.

లలిత హృదయం ద్రవించిపోయింది!

స్నేహితుల సుకుమార హృదయాలకు మనసులో నివాళు లర్పించింది. ★